క్లుప్తంగా

ముగిసిన శిక్షణ

డెంకాడ: చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎల్రక్టానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్, ఎల్రక్టికల్ అండ్ ఎల్రక్టానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ల్యాబ్యూరియల్ టైం అప్లికేషన్స్ అనే అంశంపై వారం రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. విశాఖ గీతం యూనివర్సిటీ, ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్తుతి ఇన్చార్జి జి.శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎల్ రాజు, ట్రెనింగ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి.శ్రీనివాస్, వివిధ విభాగాధిపతులు సునీల్‌ప్రకాష్, ఆర్.రమేష్, మస్తాన్‌వలీ, టీఎస్ఎస్ఎన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికల అభ్యున్నతికి పాటుపడాలి

విజయనగరం టౌన్: బాలికల అభ్యున్నతికి కృషి చేయాలని నారాయణ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ మొయిద నారాయణరావు పిలుపునిచ్చారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులు పలకలపై గర్ల్ చైల్డ్ డే అని అక్షర రూపంలో రాసి ప్రదర్శించారు. బాలికలు ఐక్యంగా ఉండి, మన హక్కులను కాపాడుకుందాం అంటూ నినదించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా



సీడీపీఓతో మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

విజయనగరం ఫోర్ట్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద మంగళవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అందించాలన్నారు. అదే విధంగా అంగన్‌వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీఓ ప్రసన్నకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పైడిరాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

విజయనగరం పూల్‌బాగ్: ప్రభుత్వ విద్య పరిరక్షణకు, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల సాధన కోసం దేశంలో ఉన్నటువంటి విద్యార్థులంతా ఐక్యంగా ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. స్థానిక అమర్‌భవన్‌లో మంగళవారం జిల్లా సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు ఒమ్మి రమణ, బుగత అశోక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ సునీల్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు వ్యతిరేకించాలి

- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాకేష్ రెడ్డి

విజయనగరం ఫోర్ట్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు గురించి ప్రజలకు తెలియజేయాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి అన్నారు. స్థానిక డీసీసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి 26వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా రాహుల్ గాంధీ పాదయాత్ర ఉంటుందని తెలిపారు. పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు రమేష్‌కుమార్, డోల శ్రీనివాసరావు, సుంకరి సతీష్, జమ్ము ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పథకాలపై జాతీయ వర్క్‌షాప్‌లో ప్రస్తావన

శృంగవరపుకోట: 'రాష్ట్రాల ఆర్థిక వనరులు' అనే అంశంపై పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో రెండో రోజు మంగళవారం నిర్వ హించిన జాతీయ విధాన వర్క్‌షాప్‌లో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు,ఆర్థిక ప్రయోజనాలు, పథకాల అమలులో అనుసరిస్తున్న విధానాలు, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ వాటాను కలిపి అందిస్తున్న తీరును వివరించారు. అనంతరం పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ సంస్థ డైరెక్టర్ మాధవన్‌ను, సదస్సు నిర్వాహకుడు శ్రీమానవన్‌ను ఎమ్మెల్సీ కలిశారు. సదస్సులో విజయనగరం జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ పి.వి.వి.సూర్యనారాయణ(సురేష్ బాబు) కూడా హాజరయ్యారు.

వచ్చే ఎన్నికల్లో
వైఎస్సార్‌సీపీ జెండా మళ్లీ ఎగరాలి

- సంక్షేమం సాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలి
- పారదర్శకత పాలన కోసమే సచివాలయ వ్యవస్థ
- ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించాలి
- టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

విజయనగరం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలని, ఇందుకు ఇప్పటి నుంచే రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 175 సీట్లను క్లీన్ స్వీప్ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నగరంలోని లీ ప్యారడైజ్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. విజయనగరం నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పాలన సాగాలంటే ముఖ్యమంత్రిగా మరల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని సూచించారు. టీడీపీ అధినేత చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌లు కలిసి తమ అనుకూల మీడియాల సహకారంతో ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై చేస్తోన్న దుష్ప్రచారాలను, అబద్ధపు ఆరోపణలు తిప్పికొట్టాలన్నారు. ఇదే సమయంలో గడిచిన నాలుగేళ్లలో మన ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని సూచించారు. ఈ ప్రక్రియను నూతనంగా ఏర్పాటు చేస్తోన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు విజయవంతంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లు లేని నిరుపేదలకు 30 లక్షలు ఇళ్ల నిర్మిస్తుంటే ఒక్క విజయనగరం నియోజకవర్గంలోనే 23వేల ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. రానున్న రెండు నెలల్లో భోగాపురంలో విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేయటం ద్వారా ప్రపంచ పటంలో విజయనగరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తామన్నారు. విజయనగరం నగర ప్రజలకు మంచి నీటి సమస్య తీర్చేందుకు రూ.200 కోట్లతో తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టును పూర్తి చేసే దిశగా చర్యలు వేగవంతం చేయటం జరుగుతుందన్నారు.

ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ పేరున మరిపించి నియోజకవర్గంలో శాశ్వతంగా వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేసేలా అందరం కలిసికట్టుగా పని చేస్తామన్నారు. ఇదే సందర్భంలో జిల్లా వ్యాప్తంగా అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలిపించటంలో కీలక పాత్ర పోషిస్తామన్నారు. ఈ నెల 30లోగా గృహ సారథుల నియామక ప్రక్రియ పూర్తి చేయటంతో పాటు ప్రతిపక్ష పార్టీ తీరుతో ఆ పార్టీలో విసిగి వేసారిపోయిన నాయకులు, కార్యకర్తలను పార్టీలోకి ఆకర్షించేలా కృషి చేస్తామన్నారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మన భవిష్యత్‌ను నిర్ణయించుకునే అధికారం మనకే ఉందని, 2024 ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ముందుగానే సిద్ధం కావాలని సూచించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవటం చారిత్రాత్మక అవసరమని, ఎన్నికల సమయానికి చిన్నపాటి లోపాలను సరిదిద్దుకుని పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. విజయనగరం నియోజకవర్గంలో గడిచిన ఎన్నికల్లో ఏ విధంగా విజయపథాన నడిపించామో అంతకు మించిన మెజార్టీతో గెలుపు సాధించాలన్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని చెప్పారు. ఈ క్రమంలో అన్ని నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతంపై క్షేత్ర స్థాయిలో ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. సమావేశంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఎంపీపీ మామిడి.అప్పలనాయుడులు మాట్లాడగా... డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతీదేవి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి. రాజేష్, మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు సంగంరెడ్డి బంగారునాయుడు, కెవి.సూర్యనారాయణరాజు, డాక్టర్ విఎస్. ప్రసాద్, కోలగట్ల తమ్మన్నశెట్టి, ముద్దాడ మధు, కాళ్ల సూరిబాబు, కంటుభుక్త తవిటిరాజు పాల్గొన్నారు.



హాజరైన విజయనగరం నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు

వ్యాపారాభివృద్ధితో పాటు
సంఘ సేవ చేయాలి



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన భవనం ప్రారంభం

విజయనగరం అర్బన్: వ్యాపారులు కేవలం వ్యాపార అభివృద్ధే లక్ష్యంగా కాకుండా సమాజానికి సేవలందించే దృక్పథంతో వ్యాపారాలు చేయాలని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. విజయనగరం చాంబర్ ఆఫ్ కామర్స్ స్థానిక ఉల్లివీధిలో నిర్మించిన నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలిత నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ సమయంలో వ్యాపారులను సంఘటితం చేసి నిత్యావసర సరుకులు, ఆక్సిజన్ సిలిండర్ల సరఫరా వంటి అత్యవసర సేవల వ్యవహారాల్లో చాంబర్ ద్వారా తగిన సూచనలిచ్చి నిర్వహించామన్నారు. నగర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని, చాంబర్ కూడా ఈ కార్యక్రమంలో తనవంతు సహకారమందివ్వాలని తెలిపారు. చాంబర్ ఉపాధ్యక్షుడు ముచ్చి రామలింగస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ విజయవాడ అధ్యక్షుడు వక్కలగడ్డి భాస్కరరావు పాల్గొన్నారు. అనంతరం పూర్వాధ్యక్షులను సన్మానించారు. నూతన భవన నిర్మాణం నిమిత్తం విరాళాలిచ్చిన దాతలను ముఖ్య అతిథులు సత్కరించారు.

నూతన కార్యవర్గం పదవీ స్వీకారం

చాంబర్ ఆఫ్ కామర్స్ 2022 – 25 సంవత్సరానికి ఎన్నుకున్న నూతన కార్యవర్గం తొలిత బాధ్యతలు తీసుకొని ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడుగా కాపుగంటి ప్రకాష్, కార్యదర్శిగా రవ్వా శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు, కార్యనిర్వాహక వర్గ సభ్యులు బాధ్యత తీసుకున్నారు. నూతన కార్యవర్గాన్ని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఏపీ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ విజయవాడ అధ్యక్షుడు వక్కలగడ్డి భాస్కరరావు అభినందించారు. కార్యక్రమంలో చాంబర్ సభ్యులు, వ్యాపార, వాణిజ్య సంస్థల వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను తరిమికొడదాం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

విజయనగరం పూల్‌బాగ్: ప్లాస్టిక్‌ని తరిమికొడదామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.సుదర్శనం పిలుపునిచ్చారు. స్థానిక గురజాడ పాఠశాలలో ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం, ప్లాస్టిక్ బ్యానర్స్ నిషేధం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను బతకనిద్దాం ..చదవనిద్దాం

- దిశ మహిళా పీఎస్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు
- జాతీయ బాలికాదినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దిశ మహిళా పీఎస్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు

విజయనగరం క్రైమ్: ఆడపిల్లల పట్ల తల్లిదండ్రులు వివక్ష చూపొద్దు. ఆడ, మగ పిల్లలిద్దరినీ సమాన దృష్టితో చూడాలి. మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలకు కూడా అవకాశాలు కల్పించి, వారిని బతకనిద్దాం.. ఎదగనిద్దాం.. చదవనిద్దామని దిశ మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఎం. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరం ప్రత్యేకంగా రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆయన స్టేషన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల రక్షణ, భద్రతకు పోలీసుశాఖ ఎన్నో చర్యలు చేపడుతోందన్నారు. దురదృష్టవశాత్తు చాలా మంది తల్లిదండ్రులు తమకు పుట్టబోయే బిడ్డ ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్‌లకు ఉపక్రమిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు అనాలోచితం, అనాగరికమైనవన్నారు. మారుతున్న కాలంతో పాటూ మనం కూడా మారాలని, ఆడపిల్లల పట్ల వివక్షకు స్వస్తి పలకాలని కోరారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ ఫోరం చైర్మన్ చిట్టిబాబు, దిశ మహిళా ఎస్సైలు కేటీఆర్ లక్ష్మి, కేవీ నరసింహారావు, హ్యూమన్‌రైట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ ప్రసాద్, మోంటే ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ కోఆర్డినేటర్ వరలక్ష్మి, సమాజ చైతన్య వేదిక ప్రతినిధి సత్యవతి, జొన్నాడ చిన్నారావు, విద్యాసాగర్, చింత జ్యోతి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ కాంపోనెంట్ నిధులకు చట్టబద్ధత హర్షణీయం

- మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ కాంపోనెంట్ నిధుల వినియోగానికి చట్టబద్ధత పదేళ్ల పాటు కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావడం హర్షణీయమని మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు పేర్కొన్నారు. ఉప ప్రణాళికా నిధులకు 2013లో కల్పించిన చట్టబద్ధత ముగిసినందున అత్యవసర ప్రాతిపదికన ఆర్డినెన్స్ తీసుకురావడం ద్వారా చట్టం నిర్వీర్యం కాకుండా జాగ్రత్త పడినట్లయ్యిందన్నారు. శాసనసభ సమావేశాల్లో అందుకు తగిన చట్టాన్ని ప్రవేశపెట్టి, ఆమోదం పొందే వరకూ ఈ ఆర్డినెన్స్ అమలులో ఉంటుందన్నారు. కేంద్రం బడ్జెట్ కేటాయింపుల్లో ప్రణాళిక, ఉప ప్రణాళిక తరహా విభజనలకు మంగళం పాడినప్పటి నుంచి కాంపోనెంట్ నిధులుగా వ్యవహరిస్తున్నారు. ఏ పేరుతో వ్యవహరించినా బలహీన వర్గాలకు జనాభా దామాషా పద్ధతిలో కేటాయింపులు ఉండాలన్నారు. విడుదలైన నిధుల్ని దారి మళ్లించకుండా, మురిగిపోయి వెనక్కి పోయేలా కాకుండా ఈ చట్టబద్ధత కాపాడుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి సమగ్ర అభివృద్ధికి నిర్దేశించిన పథకాల ద్వారా ఖర్చు పెట్టేలా ప్రభుత్వాన్ని జవాబుదారీ చేస్తుందన్నారు. ఏ కారణంతోనైనా ఖర్చు కాని నిధులు తర్వాత సంవత్సరంలో కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. ఆయా వర్గాల అభివృద్ధికి ఎంతో కీలకమైన ఈ చట్టం పదేళ్లు కొనసాగేలా నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

వాహనదారులకు అవగాహన అవసరం

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సుందర్ వడ్డి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సుందర్ వడ్డి

విజయనగరం క్రైమ్: రహదారి భద్రతా ప్రమాణాల పట్ల వాహనదారులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సుందర్ వడ్డి పేర్కొన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బాలాజీ జంక్షన్ నుంచి కెఎల్.పురం ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం వరకూ మంగళవారం మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారులకు అవగాహన కోసమే వారోత్సవాలతో పాటూ వివిధ రకాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియమాలతో పాటూ సీట్ బెల్ట్ పెట్టుకోవడం, హెల్మెట్ ధరించడం, ఇతర భద్రతా చర్యలు, లైసెన్స్‌లు పొందే విధానం తదితర అంశాలను వివరించామన్నారు. వీటిని నిరంతరం నిర్వహించడం ద్వారా ఎక్కువ మందికి అవగాహన కల్పించేందుకు కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్‌లు ఎవి.రమణ, ఎన్.రమేష్, యు.దుర్గాప్రసాద్, రవిశంకర్ ప్రసాద్, శ్రావ్య, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే రోడ్డు ప్రమాదాలకు చెక్



విజయనగరం ఫోర్ట్: వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ తదితరులు

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పద్మలీల, సూపరింటెండెంట్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సమావేశ మందిరంలో రహదారి భద్రతా వారోత్సవాలు సందర్భంగా మంగళవారం వైద్య సిబ్బందికి నిర్వహించిన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. మానవ తప్పిదాలు వల్ల కూడా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అతి వేగంగా వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు సకాలంలో ఆస్పత్రిలో చేర్పించితే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చునని తెలిపారు. నిద్ర వస్తున్న సమయంలో డ్రైవర్లు వాహనాలను నడపరాదని అన్నారు. అనంతరం రహదారి భద్రతపై రవాణ శాఖ రుపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్, ఆర్ఎంఓలు తారక్‌లక్ష్మణ్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిద్దాం...

విజయనగరం క్రైమ్: రహదారి భద్రతా నియమాలు పాటిద్దాం...ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటిద్దామంటూ వన్‌టౌన్, రూరల్ పోలీసులు మంగళవారం ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు నేతృత్వంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. అతివేగంతో ప్రయాణాలు, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి వాటి వలన రోడ్డు ప్రమాదాలు సంభవించి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. అనంతరం విద్యార్థులు, ఆటో, క్యాబ్, కార్ డ్రైవర్లతో ప్రమాణం చేయించారు. స్థానిక వీటీ అగ్రహారం జంక్షన్ వద్ద ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో రూరల్ సీఐ టివి. తిరుపతిరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐలు గణేష్, భాస్కరరావు, ట్రాఫిక్ ఎస్ఐ హరిబాబునాయుడు పాల్గొన్నారు.



వీటీ అగ్రహారం వద్ద విద్యార్థులతో ర్యాలీ

సేవల పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్



కంట్రోల్ రూమ్ సిబ్బందితో కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్:

ఏపీ సేవా పోర్టల్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు మరింత మెరుగ్గా అందించడానికి కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేయడం జరుగుతుందని కలెక్టర్ సూర్యకుమారి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను మంగళవారం సందర్శించిన కలెక్టర్ అక్కడి సిబ్బందికి పలు సూచనలను జారీ చేశారు. టిడ్కో, ఐసీడీఎస్, పౌర సరఫరాల, నాడు నేడు, సర్వ శిక్షా అభియాన్, విద్యా, మధ్యాహ్న భోజనం, ఆరోగ్యశ్రీ, హౌసింగ్ తదితర శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, పనులు పరోగతిపై డైలీ నివేదికలను కలెక్టర్‌కు ప్రతి రోజు అందిన సమాచారాన్ని క్రోడీకరించి నివేదికలను తయారు చేయడం జరుగుతుందన్నారు. దీని వలన పని తీరును రియల్ టైంలో పర్యవేక్షించి ఆయా శాఖలకు తగు ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందన్నారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది అన్ని పథకాలు, కార్యక్రమాలపై అవగాహన కలిగించుకోవాలన్నారు. కలెక్టర్ వెంట సీపీఓ పి.బాలాజీ, సచివాలయ కో–ఆర్డినేటర్ అశోక్ ఉన్నారు.

రూ.41.80 లక్షలతో ఇంటింట కుళాయిలు

లక్కవరపుకోట: మండలంలోని రంగరాయపురం పంచాయతీలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.41.80 లక్షలతో ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మంగళ వారం భూమి పూజ చేశారు. రంగరాయపురం పంచాయతీ పరిధిలో 373 ఇళ్లకు కుళాయిల ఏర్పాటు పనులను మూడు నెలల్లోగా పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎస్.పైడిరాజు తెలిపారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, ఎంపీటీసీ కె.సత్యవతి, మాజీ సర్పంచ్ దేగల సాయిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

- ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా జగనన్న పాలన
- ఎమ్మెల్య బడ్డుకొండ అప్పలనాయుడు



కోనాడలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో గడప గడపకు సంక్షేమ పథకాలు అందించినట్లు నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కోనాడ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం జరిగింది. ముందుగా దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలుకుతూ గ్రామంలో ఇంటింటికి తీసుకెళ్లారు. సచివాలయం సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి వారి పొందుతున్న లబ్ధి గూర్చి ప్రతి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే మంత్రంగా వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ప్రజల్లోకి వెళ్లి ప్రజలు ఆశీస్సులు తీసుకుంటాం అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలులో 98 శాతం వరకు అమలు చేశారన్నారు. రాబోయే ఎన్నికలలో ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, వైస్ ఎంపీపీ ఎస్.సత్యనారాయణరాజు, సర్పంచ్ బొడ్డు ఉదయభారతి, ఎంపీటీసీ దారపు అప్పలనర్సమ్మ, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసురావు, మహంతి జనార్దనరావు, అమర గురువులు, దాడిశెట్టి త్రినాధరావు, బొడ్డు ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.